క్లుప్తంగా

నేడు రైతులతో సమావేశం

యాచారం: తెలంగాణ వ్యవసాయ రైతు, సంక్షేమ కమిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం యాచారం రైతు వేదికలో రైతులతో సమావేశం ఉంటుందని మండల వ్యవసాయాధికారి రవినాథ్ తెలిపారు. ఈ సమావేశానికి పైలెట్ ప్రాజెక్టు కింద మొండిగౌరెల్లి, చౌదర్‌పల్లి, గడ్డమల్లయ్యగూడ రైతులతో సమావేశం ఉంటుందని, కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డితో పాటు వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

కేంద్ర మంత్రికి సన్మానం



కేంద్రమంత్రి బండి సంజయ్‌ను సన్మానిస్తున్న ఆచారి

ఆమనగల్లు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాల్లో బీజేపీ విజయం సాధించడంతో గురువారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి సత్కరించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వేంకటేశ్వరస్వామి వారికి హారతి ఇస్తున్న ధర్మకర్త కృష్ణమాచార్యులు

ఆమనగల్లు: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం ఆలయ వార్షికోత్సవం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త కృష్ణమాచార్యులు స్వామి వారికి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

పేదింటి ఆడబిడ్డ వివాహానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న రాందాస్‌నాయక్

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో కేతావత్ రెడ్యా–నీల దంపతుల కూతురు అశ్విని వివాహానికి బీజేపీ జిల్లా నాయకుడు రాందాస్‌నాయక్ చేయూత నందించారు. గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివాహానికి రూ.10వేలు సాయం అందజేశారు. రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ రూ.21వేల ఆర్థిక సాయంతో పాటు పట్టుచీర అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తులసీరాం, హరిచంద్, ఎంపీటీసీ మాజీ సభ్యులు సక్రిబాయి, నాయకులు పాండు, గోపాల్‌నాయక్, కల్యాణ్, చిన్న, సురేశ్, కిషన్, సిరాజ్ పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన ఎమ్మెల్యే

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్

తుక్కుగూడ: ఎన్నికల సమయంలో కుల సంఘాల భవనాల నిర్మాణాల పేరుతో నియోజకవర్గ ప్రజలను మోసం చేసి ఓట్లు దండుకున్న వ్యక్తి సబితాఇంద్రారెడ్డి అని మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని తుక్కుగూడ పురపాలక సంఘం పరిధిలోని రావిర్యాల గ్రామంలో యాదవులు, రెడ్డి, పద్మశాలి, నాయీబ్రాహ్మణులకు ప్రభుత్వ భూమిలో ఒకే ప్రదేశంలో కులసంఘాల భవనాలను నిర్మిస్తామని గత ప్రభుత్వంలో ఆమె మంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపన చేశారన్నారు. ఇప్పుడు ఆ భూమిని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం లెన్స్‌కార్ట్ పరిశ్రమ ఏర్పాటుకు కేటాయించి, మంత్రి శ్రీధర్‌బాబు పూజ చేయడం ఏమిటిని ఆయన ప్రశ్నించారు?. ఇప్పుడు ప్రభుత్వంపై ఎందుకు ఆమె పోరాటం చేయడం లేదన్నారు. ఆనాడు ఆ భూములకు పట్టాలు ఇచ్చి ఉంటే ఈ రోజు ఈ సమస్య వచ్చేది కాదన్నారు. కులసంఘాలకు ఇచ్చిన భూములను ప్రభుత్వం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల తరఫున పోరాటాలు చేస్తామన్నారు.

ఉన్న ఒక్కటీ ఉత్తిదే..

నిరుపయోగంగా చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం

- కబ్జాకు గురవుతున్న భూమి
- పట్టించుకోని మత్స్యశాఖ

ఇబ్రహీంపట్నం రూరల్: చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడక ముందే ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కట్టకింద ఈ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇక్కడ నుంచే చెరువులకు చేప పిల్లలు అందజేసేవారు.

శిథిలావస్థకు చేరిన కార్యాలయం

మున్సిపాలిటీ పరిధి శేరిగూడలో ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కట్ట కింద చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ కట్ల, రవ్వ, బంగారు తీగ, మ్రిగాలా రకం చేప పిల్లలు ఉత్పత్తి చేసి మత్స్యకారులకు అందజేయాలి. జిల్లాలో ప్రస్తుతం 196 సొసైటీలున్నాయి. వీటిలో మహిళా మార్కెటింగ్, మార్కెటింగ్ సొసైటీలు ఉన్నాయి. 196 సొసైటీలల్లో 9,856 మంది సభ్యులు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 982కు పైగా చెరువులున్నాయి. ప్రతీ ఏడాది జూన్, జూలైలో చెరువులు నిండితే వెంటనే చేపపిల్లలు ఉత్పత్తి ప్రారంభించి సీడ్ అందించాల్సి ఉంటుందని. 12 ఆర్‌సీసీ పాండ్స్, నాలుగు పెద్ద కచ్చ పాండ్స్ నిర్మించారు. ముందుగా చేపలు తీసుకువచ్చి కచ్చపాండ్స్‌లో బ్రీడింగ్ చేస్తారు. గుడ్లను తీసి పిల్లలు వచ్చాక ఆర్‌సీసీ పాండ్స్‌లో వేసి పెంచేవారు. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ ఉత్పత్తి కేంద్రం కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారింది. ఉత్పత్తి నిలిచిపోవయడంతో కార్యాలయం సైతం శిథిలావస్థకు చేరింది. తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయి.



కంప చెట్లతో నిండిన కచ్చాపాండ్స్

మిగిలింది మూడు ఎకరాలే..

ఈ ఉత్పత్తి కేంద్రానికి అప్పటి ప్రభుత్వం నాలుగున్నర ఎకరాల పొలం కేటాయించింది. ఈ భూమిని అక్రమార్కులు కబ్జా చేయడంతో ప్రస్తుతం మూడు ఎకరాలు కూడా లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి సర్వే చేసి భూమిని కాపాడాలని కోరుతున్నారు. మత్స్యశాఖ అధికారుల పర్యవేక్షణ లేక చేపల ఉత్పత్తి కేంద్రం భూమి అన్యాక్రాంతమవుతోందని వాపోతున్నారు. దీనికి తోడు ఉత్పత్తి కేంద్రంలోని బోర్లు, మోటార్లు, సామగ్రి ఏమయిందో అంతు చిక్కని సమస్య. గేటుకు తాళం లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వృథాగా ఆర్‌సీసీ పాండ్స్



శిథిలావస్థకు చేరిన చేపపిల్లల ఉత్పత్తి కేంద్ర కార్యాలయం

వినియోగంలోకి తేవాలి



మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీన్ని వినియోగంలోకి తీసుకువస్తే ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంటుంది. ఈ కేంద్రాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రభుత్వం చొరవ తీసుకుని ఉత్పత్తి కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలి.

– గొరెంకల నర్సింహ, టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

అధికారుల నిర్లక్ష్యమే



బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ఈ ఉత్పత్తి కేంద్రం కళకళాడుతుండేది. నేడు ఉత్పత్తి కేంద్రం బోసిపోయింది. అధికారుల పర్యవేక్షణ కరువై ఇలా తయారైంది. వినియోగంలోకి తీసుకొస్తే జిల్లా వ్యాప్తంగా చేప పిల్లలు అందజేయడానికి వీలవుతుంది.

– కంబాలపల్లి భరత్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్, ఇబ్రహీంపట్నం

ప్రత్యామ్నాయ శక్తిగా బీజేపీ

పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్

కడ్తాల్: రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు నిర్వహించిన ఎన్నికల్లో బీజేపీ రెండు స్థానాలను కైవసం చేసుకోవడంతో పాటు పార్టీ బలాన్ని చాటిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దోనాదుల మహేశ్ అన్నారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా బీజేపీ ఎదిగిందని చెప్పేందుకు ఈ గెలుపే నిదర్శనమన్నారు. రెండు ఎమ్మెల్సీ స్థానాల గెలుపు సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి సంబురాలు చేసుకున్నారు. ఈ విజయాన్ని అందించిన తెలంగాణ మేధావులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు, శ్రమించిన పార్టీ కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు భగీరథ్, శంకర్‌నాయక్, రెడ్యానాయక్, శ్రీశైలంగౌడ్, సాయిలాల్‌నాయక్, మాన్యనాయక్, రాందాస్‌నాయక్, వెంకటేశ్, ముసేశ్, కుమార్, మాల్యానాయక్, కల్యాణ్, రాజు, విక్రమ్‌చారి, అశోక్, శ్రీకాంత్, జంగయ్య, జగన్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ వెంకటమ్మ

ఇబ్రహీంపట్నం రూరల్: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తామని ఎంపీడీఓ వెంకటమ్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని కప్పపహాడ్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు 81 మంది ముగ్గు పోసి నిర్మాణాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం మండల పరిధిలోని కప్పపహాడ్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందన్నారు. అందులో భాగంగా తొలుత ఇళ్లు లేని పేదలను గుర్తించి వారికి ప్రాధాన్యత ఇచ్చిందని చెప్పారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ డీఈ సంపత్, ఏఈ రామచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీలత, ఇందిరమ్మ కమిటీ చైర్మన్ సతీశ్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కప్పపహాడ్‌లో ఇందిరమ్మ ఇంటికి ముగ్గు పోస్తున్న ఎంపీడీఓ వెంకటమ్మ

కనుల పండువగా రథోత్సవం



వేణుగోపాల స్వామివారి రథోత్సవంలో భక్తజనం

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండలో వేణుగోపాల స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం తెల్లవారుజామున వేదపండితులు చక్రవర్తి శ్రీనివాసాచార్యులు, కృష్ణమాచార్యులు, వేణుగోపాలాచార్యులు, తిరుమల కిరణ్ చార్యులు, రామయ్యాచార్యులు వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన రథంపై రుక్మిణీసత్యభామ వేణుగోపాల స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అధిష్టింపజేశారు. గోవింద నామస్మరణ నడుమ భక్తులు రథాన్ని లాగారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములుగౌడ్, మాజీ సర్పంచ్ భారతమ్మ, నాయకులు మహేందర్‌గౌడ్, భీష్మాచారి, రాజీవ్‌గౌడ్, లక్ష్మయ్యగౌడ్, సత్యశీలారెడ్డి, జంగయ్య, గోపాల్‌గౌడ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి

చేవెళ్ల: నంబర్ ప్లేట్ లేకుండా రోడ్డుపై మూడుసార్లు పట్టుబడితే ఆ వాహనాలను సీజ్ చేసి ఆర్టీఓకు అప్పగిస్తామని ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. చేవెళ్లలో గురువారం సివిల్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్ లేని, ఇర్రెగ్యూలర్ నంబర్ ప్లేట్ ఉన్న ద్విచక్రవాహనాలు 20, రాంగ్‌రూట్‌లో వచ్చిన వాహనాలు 09, ట్రిపుల్ రైడింగ్ చేసిన 03 వాహనాలను గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ వాయులెషన్స్‌కి పాల్పడుతున్నట్లుగా 32 వాహనాలకు ట్రాఫిక్ చలాన్లు విధించి విడిచిపెట్టినట్లు తెలిపారు. ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.



పట్టుబడిన ద్విచక్రవాహనాలు

దైవచింతన అలవర్చుకోవాలి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి

నందిగామ: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మోత్కులగూడలో గురువారం ఆంజనేయస్వామి, వినాయకుడు, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాలు నిర్మించడంతో పాటు నిత్యం దూపదీప నైవేద్యాలు సమర్పించాలని సూచించారు. ఆయన దేవాలయ నిర్మాణానికి, విగ్రహాల ప్రతిష్ఠ నిమిత్తం రూ.4లక్షల నగదును విరాళంగా నిర్వాహకులకు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నర్సింహ, జేకే నర్సింహ, జెట్ట కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కాట్న లతశ్రీశైలం, కాట్న మాధవిరవీందర్, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహాగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో గ్రామస్తులతో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

పరామర్శ

ఆమనగల్లు: పట్టణంలో రెండు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త సాయికిరణ్‌రెడ్డి మృతి చెందారు. ఈ మేరకు గురువారం మృతుడి కుటుంబీకులను మున్సిపల్ బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించి రూ.6వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, నాయకులు శివకుమార్, రమేశ్‌నాయక్, జగన్, వెంకటేశ్, భాస్కర్, గణేశ్, యాదయ్య, గణేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీని వినియోగించుకోండి

ఆమనగల్లు/తుర్కయంజాల్: ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నవారు ఈ నెల 31లోగా ఫీజు చెల్లించి 25 శాతం రాయితీ పొందాలని ఆమనగల్లు ఎంపీడీఓ కుసుమమాధురి, తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి సూచించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 2020లో రూ.వేయి చెల్లించి దరఖాస్తు చేసుకున్నవారు ఈ రాయితీ పొందేందుకు అర్హులు అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని అనధికార లేఅవుట్లలోని తమ స్థలాలను క్రమబద్ధీకరణ చేసుకోవాలన్నారు.

ఫీజుల దోపిడీకి కళ్లెం వేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శంకర్



మాట్లాడుతున్న శంకర్

ఇబ్రహీంపట్నం రూరల్: డొనేషన్ల పేరిట విద్యార్థుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలకు కళ్లెం వేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బాయికాడి శంకర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని పాషానరహరి సార్మక కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశాడు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ఏఐసీటీఈ నిబంధనలు, జేఎన్‌టీయూ నామ్స్‌ను తుంగలో తొక్కుతున్న ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు అటానమస్ పేరిట అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు పెంచకుండా ప్రైవేట్ కళాశాలలకు ఎందుకు అనుమతులిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. నామమాత్రపు చదువులు చెబుతూ విద్యార్థులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కళాశాలల ఆడిట్ రిపోర్టులు పరిశీలించిన తర్వాతే ఫీజులు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. తప్పుడు నివేదికలు అందజేసే కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు వంశీ, వేణు, అజయ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 236 మంది విద్యార్థులకు గాను 233 మంది విద్యార్థులు హాజరవగా ముగ్గురు గైర్హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని పరీక్షల పర్యవేక్షకులు మాధవరావ్, అనంతరెడ్డి తెలిపారు.

ప్రజా సమస్యలపై ఇంటింటి సర్వే



యాచారం: ధర్మన్నగూడెంలో సమస్యలు తెలుసుకుంటున్న అంజయ్య తదితరులు

యాచారం: ప్రజా సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.అంజయ్య స్థానిక నాయకులతో కలిసి మండల పరిధిలోని ధర్మన్నగూడెంలో ఇంటింటికీ తిరుగుతూ సమస్యలను తెలుసుకున్నారు. తాగునీరు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లపై ఫిర్యాదు చేశారు. గ్యాస్ సబ్సిడీ అందడం లేదని పలువురు మహిళలు వాపోయారు, ధరణి సమస్య ల కారణంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. బాలరాజు, రమేష్, రాములు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నంలో..

ప్రభుత్వాలు విఫలం

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం ఇబ్రహీంపట్నం మున్సిపల్ కన్వీనర్ చింతపట్ల ఎల్లేశ్ ఆరోపించారు. సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లేష్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు వెంటనే జారీ చేయాలని కోరారు. మున్సిపల్ కమిటీ సభ్యులు వీరేశం, ముసలయ్య, నాయకులు హనుమంతు శివ, నర్సింహ, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

‘దండోరా’ను విజయవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మద్దిలేటి మాదిగ

చేవెళ్ల: ఎస్సీ వర్గీకరణలో రిజర్వేషన్ల కేటాయింపులు శాస్త్రీయంగా చేయాలని, మంత్రి వర్గంలో మాదిగలకు 2 స్థానాలు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మద్దిలేటి మాదిగ అన్నారు. చేవెళ్లలో గురువారం నియోజకవర్గ ఎమ్మార్పీస్, అనుబంధ సంఘాల నాయకులతో చేవెళ్ల మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ.. ఈ నెల 11న చేవెళ్లలో జిల్లా మాదిగ దండోరా మహా ప్రదర్శన నిర్వహించనున్నామని, మాదిగలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మహా ప్రదర్శనకు ముఖ్య అతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రానున్నట్లు తెలిపారు. మాదిగలకు న్యాయబద్ధంగా రిజర్వేషన్లు కేటాయించటంలో కమిషన్ వివక్షత చూపించినట్లుగా ఉందన్నారు. అత్యధిక జనాభా కలిగి ఉన్న మాదిగలకు 9శాతం రిజర్వేషన్లు కేటాయించటం అన్యాయమని ఆరోపించారు. జనాభా ప్రతిపాదికన చూస్తే 12శాతం రావాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రశాంత్, శంకర్‌రావు, ప్రవీణ్, శివశంకర్, భానుప్రసాద్, రాజు, నరేశ్, రాములు, ప్రసాద్, మల్లేశ్, మహేందర్, విజయ్, కుమార్, అనంతరాములు, రమేశ్ తదితరులు ఉన్నారు.

కలుపుమందు పిచికారీతో పంట నష్టం

- పరిహారం చెల్లించాలంటున్న రైతు
- పంటను పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి



పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి శిరీష

కేశంపేట: పంటలో వచ్చిన కలుపును తొలగించుకునేందుకు రైతు ఫర్టిలైజర్ దుకాణంలో కొనుగోలు చేసిన మందును చేనులో పిచికారీ చేశాడు. కలుపు తొలగడం ఏమో కానీ ఉన్న పంట ఎండిపోయింది. మండల పరిధిలోని అల్వాల గ్రామంలో రైతు శ్రీధర్‌రెడ్డి తన వ్యవసాయ భూమిలో ఐదెఎకరాల వరకు మొక్కజొన్న పంటను సాగు చేశాడు. పంటలో కలుపు నివారణ కోసం కేశంపేట గ్రామంలోని గ్రోమోర్ ఫర్టిలైజర్ దుకాణాన్ని సంప్రదించాడు. అక్కడ ఉన్న సిబ్బందికి మొక్కజొన్న విత్తనాలను నాటి 30 రోజుల దాటిందని, కలుపు ఉందని రైతు తెలిపాడు. గ్రోమోర్ కేంద్రం సిబ్బంది రైతుకు అట్రిజన్ స్ప్రే మందును ఇచ్చి ఎలా వాడాలో తెలిపాడు. అతడు చెప్పిన విధంగా పంట పైన స్ప్రే చేసిన తర్వాత మొక్కజొన్న పంట ఎండిపోతున్నట్టు గుర్తించిన రైతు మళ్లీ గ్రోమోర్ కేంద్రాన్ని సంప్రదించాడు. వారు కంపెనీ వారికి సమాచారం ఇవ్వడంతో పంటను పరిశీలించి వెళ్లారు. స్ప్రే మందు వికటించి పంట ఎండిపోయిందని, వేరే పంటను వేసుకోవాలని అట్రిజన్ కంపెనీ ప్రతినిధి తెలిపినట్టు రైతు ఆరోపించారు. తనకు ఆ పంట సాగు ఎకరానికి రూ.50వేల వరకు ఖర్చు అయినట్టు రైతు తెలిపాడు. గురువారం మండల వ్యవసాయ అధికారి శిరీష ఎండిపోయిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ సుధ, రైతు పాండురంగారెడ్డి తదితరులు ఉన్నారు.